సాక్షి నిర్మల్


శనివారం ၊ 27 ၊ సెప్టెంబర్ ၊ 2025

I



పుట్టింటికి ఆడబిడ్డలు! IIలో▸

బతుకమ్మ పండుగ ఆడబిడ్డల పండుగ. యువతులు, మహిళలకు బతుకమ్మ పండుగ ఎంతో ప్రత్యేకమైనది. ఉమ్మడి జిల్లాలోని ఆడ బిడ్డలు పండుగకు పుట్టింటికి వచ్చారు.



అమ్మవారికి కరెన్సీ హారం

లోకేశ్వరం మండలం ధర్మోర, పంచగుడి గ్రామాల్లో, ఖానాపూర్ పట్టణంలోని గాంధీన గర్‌తోపాటు తర్లపాడ్ గ్రామంలో దుర్గామా తకు కరెన్సీ నోట్లతో హారాలు వేశారు. IIలో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
27.5 /24.5

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. అల్పపీడనం ప్రభావంతో జిల్లా అంతటా మోస్తరు వానలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం



ఐలమ్మకు నివాళులర్పిస్తున్న అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని స్థానిక అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఐలమ్మ జయంతిని శుక్రవారం అధికారికంగా నిర్వహించారు. పలువురు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసి తెలంగాణ పోరాటాల చరిత్రలో ఒక గొప్ప అధ్యయనాన్ని లిఖించిందన్నారు. వెట్టి చాకిరీ నిర్మూలనకు పాటుపడిన గొప్ప మహిళ అని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, రజక సంఘం అధ్యక్షుడు శంకర్, సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న అధికారులకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ అధికారి తమ విధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలన్నారు. శిక్షకులు ఇచ్చిన సమాచారాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకుని విధులు నిర్వహించాలన్నారు. సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో గోవింద్, డీఈవో భోజన్న, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బతుకమ్మ ఆడిన మహిళా అధికారులు



బతుకమ్మ ఆడుతున్న మహిళా అధికారులు

నిర్మల్ టౌన్: టీజీవో నిర్మల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చారు. అనంతరం కళాశాల ఆవరణలో ఆడిపాడారు. టీజీవో జిల్లా అధ్యక్షుడు పీజీ.రెడ్డి, జిల్లా కార్యదర్శి దాత్రిక రమేశ్, అసోసియేట్ అధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి, ఈసీ మెంబర్ కర్ణశ్రీ, కార్యవర్గ సభ్యులు, మహిళా అధికారులు పాల్గొన్నారు.

బస్సు ఎక్కితే బహుమతి

నిర్మల్‌టౌన్: దసరా పండుగ రద్దీ నేపథ్యంలో ప్రయాణికులను ఆకట్టుకునేందుకు ఆర్టీసీ బహుమతులు ప్రకటించింది. బస్సులో ప్రయాణించిన వారికి వారికి బహుమతులు అందించాలని నిర్ణయించింది. సెమీ డీలక్స్, సూపర్ లగ్జరీ, రాజధాని, ఏసీ బస్సుల్లో ప్రయాణించే వారికి లక్కీడ్రా నిర్వహించాలని ఆర్టీసీ నిర్ణయించిందన్నారు. రీజియన్‌కు ముగ్గురు చొప్పున 33 మందికి రూ.5.50 లక్షల విలువైన బహుమతులు అందజేస్తారు. ఒక్కో రీజియన్‌కు ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు ఇవ్వనున్నారు. ఈనెల 27 నుంచి అక్టోబర్ 06 వరకు ప్రయాణించినవారికి మాత్రమే ఈ బహుమతులు అందుతాయి. ప్రయాణికులు బస్సు దిగిన చోటే బస్టాండ్ డ్రా బాక్స్‌లో టికెట్ వెనకాల పేరు, ఫోన్ నంబర్ రాసి అందులో వెయ్యాలి. లక్కీ డ్రా అక్టోబర్ 8న రీజియన్ కార్యాలయంలో మేనేజర్ చేతుల మీదుగా తీస్తామన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



భైంసాటౌన్: దేవీ నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని అదనపు ఎస్పీ అవినాష్‌కుమార్, సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ కోరారు. పట్టణంలోని భవానీచౌక్ దుర్గామాత మండపంలో శుక్రవారం పూజలు చేశారు. హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. శాంతియుత ఉత్సవాల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వారివెంట సీఐ గోపీనాథ్ ఉన్నారు.

చలో గంగనీళ్ల జాతర



బాలాలయంలో అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు



బాలాలయంలో అడెల్లి మహాపోచమ్మ అమ్మవారు

- నేటి నుంచి అడెల్లి మహాపోచమ్మ జాతర
- ఏర్పాట్లు చేసిన దేవాదాయ శాఖ అధికారులు
- భారీగా తరలిరానున్న భక్తులు
- ఈసారీ.. బాలాలయంలోనే..

సారంగపూర్: జిల్లాలోని అడెల్లి గ్రామానికి జాతర శోభ వచ్చింది. మహాపోచమ్మ గంగనీళ్ల జాతర శని, ఆదివారాల్లో(27, 28 తేదీల్లో) నిర్వహించనున్నారు. మహాలయ అమావాస్య తర్వాత వచ్చే శని, ఆదివారాల్లో జాతర నిర్వహించడం సంప్రదాయం. జాతర కోసంఅధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

ఆభరణాల మూటగట్టడంతో జాతర..

జాతర శనివారం ఉదయం అమ్మవారి ఆభరణాలను మూటగట్టడంతో ఆరంభమవుతుంది. కొట్ల(బి), అడెల్లి, సారంగాపూర్ గ్రామాల భక్తులు, సేవాదారులు అడెల్లి పోచమ్మ ఆలయం నుంచి ఆభరణాలను తలపై ధరించి కాలినడకన దిలావర్‌పూర్ మండలం సాంగ్వి గ్రామంలో గోదావరి నదికి చేరుకుంటారు. ఈ యాత్రలో ఆభరణాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామస్తులు మేళతాళాలతో, సంప్రదాయ వాయిద్యాలతో సాగనంపుతారు.

గోదావరి యాత్ర..

ఆభరణాలను సేవాదారులు తలపై ధరించి అడెల్లి, సారంగాపూర్, యాకర్‌పెల్లి, వంజర్, ప్యారమూర్, కదిలి, మాడెగాం, దిలావర్‌పూర్, బన్సపెల్లి, కంజర్, మల్లాపూర్ గ్రామాల మీదుగా సాంగ్వి చేరుకుంటారు. భక్తులు ''గంగా నీకు శరణమే'' అంటూ భక్తి గీతాలు ఆలపిస్తూ యాత్రలో పాల్గొంటారు. సాంగ్విలోని పోచమ్మ ఆలయంలో ఆభరణాలను ఉంచి పూజలు నిర్వహిస్తారు. ఆదివారం తెల్లవారుజామున ఆభరణాలను గోదావరి నదీతీరానికి తీసుకెళ్లి శుద్ధి చేసి, మూటగట్టి తిరిగి అడెల్లి ఆలయానికి చేరుకుంటారు.

అడెల్లిలో మహోత్సవం..

ఆదివారం ఉదయం అమ్మవారికి పూజలు నిర్వహించిన తర్వాత భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. రాత్రి 10 గంటల వరకు ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతాయి. ఈ జాతరకు భారీగా భక్తులు తరలిరావడంతో మహాజాతరగా పిలుస్తారు. ఆభరణాలను అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజలతో జాతర ముగుస్తుంది.

ప్రత్యేక ఏర్పాట్లు..

జాతర కోసం నిర్మల్, భైంసా నుంచి అడెల్లి ఆలయానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. నిర్మల్ రూరల్ సీఐ, స్థానిక ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహన పార్కింగ్ కోసం ఆలయానికి దూరంగా స్థలం కేటాయించారు. స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు.

బాలాలయంలోనే పూజలు..

అడెల్లి మహాపోచమ్మ నూతన ఆలయ నిర్మాణం మూడు నెలల క్రితం పూర్తయింది. అయినా అధికారుల నిర్లక్ష్యం, పాలకుల సమన్వయ లోపంతో ప్రారంభోత్సవం జరగలేదు. చెన్నైలోని మహాబలిపురంలో 11.51 లక్షలతో విగ్రహాల తయారీ పూర్తయినా వాటి ప్రతిష్ఠాపనలో జాప్యం జరుగుతోంది. దసరా, దీపావళి మధ్య ప్రతిష్ఠాపన చేస్తామని అధికారులు చెబుతున్నారు. దీంతో జాతర, పూజలు ఈసారి కూడా బాలాలయంలోనే నిర్వహిస్తారు.

ఏర్పాట్లు పూర్తి..

జాతర నిర్వహణ కోసం విస్తృత ఏర్పాట్లు చేపట్టాం. వారం రోజుల ముందునుంచే ఆయా గ్రామాల్లో, మండలాల్లో ప్రచారం నిర్వహించాం. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ బస్సు సౌకర్యం, వైద్యసదుపాయం, తాగునీరు, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం.

– భోజాగౌడ్, అడెల్లి ఆలయ కమిటీ అధ్యక్షుడు

సాంగ్విలో ఏర్పాట్లు

దిలావర్‌పూర్: గంగనీళ్ల జాతరకు మండలంలోని సాంగ్వి గ్రామంలో ఏర్పాట్లు చేశారు. సారంగాపూర్, దిలావర్‌పూర్ మీదుగా అమ్మవారి నగలు శోభయాత్రగా సాంగ్వికి చేరుకుంటాయి. శనివారం సారంగాపూర్ మండలం అడెల్లి మహాపోచమ్మ ఆలయం నుంచి నగలను దిలావర్‌పూర్ మండలం కదిలి, మాటేగాం, దిలావర్‌పూర్, బన్సపల్లి, కంజర్ గ్రామాల మీదుగా సాంగ్వికి తీసుకురానున్నారు. శనివారం రాత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆదివారం గోదావరి నదీతీరంలో అమ్మవారి నగలను నదీజలాలతో శుద్ధిచేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం అడెల్లికి తీసుకెళ్తారు. ఏఎస్పీ రాజేశ్‌మీనా, సీఐ కృష్ణ, దిలావర్‌పూర్ ఎస్సై రవీందర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఏ స్థానం ఎవరికో..?

- జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లు ఖరారు
- అధికారికంగా ప్రకటించని జిల్లా యంత్రాంగం
- షెడ్యూల్ వెలువడే వరకు గోప్యంగానే..

నిర్మల్‌చైన్‌గేట్:స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్న ప్రభుత్వం రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తిచేసింది. అయితే అధికారికంగా ప్రకటించలేదు. జిల్లాస్థాయి అధికారుల నేతృత్వంలో ప్రత్యేక బృందాలు రెండు రోజులపాటు కసరత్తు చేసి రిజర్వేషన్ల జాబితా సిద్ధం చేశాయి.

బీసీలకు 42 శాతం..

ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈసారి బీసీలకు 42 శాతం సీట్లు రిజర్వు చేశారు. 2011 జనగణన ఆధారంగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు, బీసీ జనాభా లెక్కల ప్రకారం బీసీ రిజర్వేషన్లు నిర్ణయించారు. జిల్లాలో 18 జెడ్పీటీసీ స్థానాల్లో 7 బీసీలకు రిజర్వు చేశారు. 157 ఎంపీటీసీ స్థానాలలో 66 బీసీలకు కేటాయించారు. మండల పరిషత్ అధ్యక్షులు(ఎంపీపీ), సర్పంచ్ పదవుల్లోనూ బీసీలకు అవకాశం లభించనుంది.

జనరల్ అభ్యర్థుల్లో నిరాశ

బీసీల రిజర్వేషన్లు పెరగడంతో జనరల్ కేటగిరీకి వచ్చే స్థానాలు గణనీయంగా తగ్గాయి. దీంతో జనరల్ ఆశావహులలో అనిశ్చితి నెలకొంది. ఆశించిన నియోజకవర్గాలు రిజర్వేషన్ కారణంగా దక్కకపోవచ్చనే ఆందోళనతో పలువురు ప్రధాన నేతల మద్దతు కోసం ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించారు.

వాతావరణం వేడెక్కుతోంది

గ్రామపంచాయతీ, పరిషత్ స్థాయి ఓటర్ల తుది జాబితా ఇప్పటికే వెలువడింది. జిల్లాలోని 400 గ్రామపంచాయతీల్లో 4,49,302 మంది ఓటర్లు ఉన్నారు. 892 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. రిజర్వేషన్లపై అధికారిక ప్రకటన వచ్చిన వెంటనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది. దీంతో అభ్యర్థులు అనుచరులతో వ్యూహారచనలో నిమగ్నమవుతున్నారు. ఏ స్థానం ఎవరికి రిజర్వ్ అవుతుందనే లెక్కలపై అధిక శ్రద్ధ పెడుతూ పోటీ చేయగల నియోజకవర్గాలను ముందుగానే ఎంచుకుంటున్నారు.

బీసీల్లో ఉత్సాహం..

ఈ రిజర్వేషన్ల కారణంగా బీసీ అభ్యర్థుల్లో ఉత్సాహం గణనీయంగా పెరిగింది. పెద్ద సంఖ్యలో వారు ఎన్నికల్లో బరిలోకి దిగేందుకు సన్నద్ధమవుతున్నారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలు ఈసారి మరింత ఉత్కంఠభరితంగా, గట్టి పోటీ వాతావరణంలో జరిగే అవకాశముంది.

సాంగ్విలో 18వ శతాబ్దపు విగ్రహాలు



అరుదైన చండిక, చాముండి విగ్రహాలు

దిలావర్‌పూర్: మండలంలోని సాంగ్వి గ్రామ శివారు గోదావరి తీరాన చండిక, చాముండీ విగ్రహాలను గుర్తించినట్లు ప్రముఖ కవి, రచయిత డాక్టర్ తుమ్మల దేవరావు తెలిపారు. ఈ విగ్రహాల విశిష్టత వాటి స్వరూపాన్ని శుక్రవారం వివరించారు. చండిక పార్వతీదేవి రౌద్రరూపంగా, ఆది పరాశక్తిగా వర్ణింపబడుతుందన్నారు. చండా అంటే చేయించగల అని అర్థమన్నారు. శ్వేతాశ్వతరోపనిషత్‌లో చండికను ఆది పరాశక్తిగా వర్ణించారని తెలిపారు. మహిషాసుర మర్దనం చేయడం ద్వారా దుర్గాదేవిగా చండికను భావిస్తారన్నారు. మెడలో పుర్రెలతో కూడిన హారం, కుడిచేతిలో ఆయుధం, ఎడమ చేతిలో బిందు, మోదకం, కర్ణాభరణాలు ఉన్నాయని వివరించారు. ఉగ్రరూపంలో ఉన్న చండిక దుష్ట సంహారణ చేసి భక్తులకు అభయమిచ్చిందని భావిస్తారని తెలిపారు. అలాగే మరో ప్రతిమ చాముండీ చాముండేశ్వరీ దేవిగా వివిధ పేర్లతో పిలిచే చాముండీ పార్వతీదేవి ఉగ్రరూపం అన్నారు. సప్త మాతృకలలో ఒకటిగా భావిస్తారన్నారు. దేవీ పురాణాల్లో దుర్గాదేవి సైన్యంలో 81 మంది తాంత్రిక దేవతలలో ఒక యోగినిగా చాముండిని ఆరాధిస్తారని పేర్కొన్నారు. చెండా, ముండా అనే ఇద్దరు రాక్షసులను సంహరించడం వల్ల చాముండేశ్వరీగా పిలుస్తారని తెలిపారు. చాంముడేశ్వరీ భయంకరమైన రూపం కలిగి మెడలో కపాల మాల, కుడిచేతిలో కత్తి, మరో చేతిలో ఆయుధం, గుడ్లగూబ వాహనంగా ఉంటుందని వివరించారు. ఈ రెండు విగ్రహాలు 18వ శతాబ్దపు కాలంలో ఆరాధనలు జరిగినట్లు తెలియజేస్తుందన్నారు. కర్ణాటక ప్రాంతంలో మధ్య భారతంలో చాముండీ, చండిక దేవతలను ఆరాధించారని తెలిపారు. క్షేత్ర పర్యటనలో భాగంగా తుమ్మల దేవరావుతోపాటు అబ్బిడి రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

జల సంరక్షణలో భేష్

- జాతీయ స్థాయిలో 'జల్ సంచయ్ జన్ భాగీధారి' పురస్కారం
- భూగర్భ జలాల పెంపులో మూడు జిల్లాల ప్రగతి
- ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలకు రూ.2కోట్లు, నిర్మల్‌కు రూ.కోటి నగదు



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న డీఆర్డీవో

జిల్లా	చేపట్టిన నిర్మాణాలు
ఆదిలాబాద్	98,693
మంచిర్యాల	84549
నిర్మల్	60365

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: భూగర్భ జలాల పెంపు, సంరక్షణ చర్యలకుగాను మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కింది. కేంద్ర ప్రభుత్వ 'జల్ సంచయ్ జన్ భాగీధారి' అవార్డు వరించింది. ఇందుకు ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలకు రూ.2కోట్ల చొప్పున, నిర్మల్ జిల్లాకు రూ.కోటి నగదు పురస్కారం అందనుంది. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నీటి సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. 'నీటిని ఒడిసిపట్టు–వాన ఎప్పుడు, ఎక్కడ కురిసినా' అనే నినాదంతో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ గత నాలుగేళ్లుగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. గత ఏడాది నుంచి మరింత ప్రోత్సాహం అందించేందుకు ఆయా జిల్లాల్లో చేపట్టిన పనులపై అవార్డులతోపాటు నగదు పురస్కారంతోనూ సత్కరిస్తోంది. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం భూగర్భ జలాల లభ్యత, నీటి సంరక్షణ, నా ణ్యత పెంచుకోవడంతోపాటు మారుతున్న వాతావరణానికి అనుగుణంగా కరువును ఎదుర్కొనేలా వాననీటిని ఒడిసిపట్టి భవిష్యత్ తరాలకు వాడుకోవాల్సి ఉంటుంది.

సత్ఫలితాలు ఇస్తున్న నిర్మాణాలు

ఉపాధి హామీ పథకంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని పలు పథకాల కింద భూగర్భ జలాల పెంపునకు గ్రామీణ ప్రాంతాల్లో నీటికుంటలు, చెరువులు, చెక్‌డ్యామ్‌లు, కందకాలు, పైకప్పు నీటి సేకరణ నిర్మాణాలు, వ్యక్తిగత, సామాజికపరంగా, బోర్ రీచార్జి కుంటలు నిర్మిస్తున్నారు. ఇవే కాకుండా పట్టణాల్లో ఇంటింటికీ ఇంకుడుగుంతల నిర్మాణాలు చేపడుతున్నారు. అలాగే వ్యవసాయ, తాగు, సాగు అవసరాలు, అటవీ ప్రాంతాల వృద్ధి కోసం ఆయా చోట్ల సామాజికపరంగా ఉపయోగపడేందుకు చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తున్నారు. దీంతో వర్షపు నీటిని ఎక్కడికక్కడ భూమిలో ఇంకేలా చేయడంతో సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఈ వివరాలను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. నమోదు చేసిన వివరాల ప్రకారం గత మే నెలలో కేంద్ర అధికారులు, శాస్త్రవేత్తల బృందాలు భూగర్భ జలాల పరిరక్షణకు చేపట్టిన నిర్మాణాలతో భూమిలో నీటి లభ్యత పెరిగినట్లు గుర్తించారు. దీంతో వ్యవసాయానికి బావులు, బోర్ల నీటి ఊటలు పెరిగినట్లు గుర్తించారు. అలాగే ఇంకుడు గుంతలతోనూ జల వృద్ధి ఉన్నట్లుగా తేలింది. నీటిని సద్వినియోగంతో ఆయా ప్రాంతాల అభివృద్ధికి దోహదపడనుంది.

బతుకమ్మ వేడుక.. చైతన్య వేదిక

- మహిళలతో కలిసి పాల్గొంటున్న ఎస్పీ జానకీషర్మిల
- మోసాలు, నేరాలపై అవగాహన..
- గృహిణులకు సందేశమిస్తున్న పోలీసులు



జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘంలో మహిళలతో ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్: తెలంగాణ సంప్రదాయ పండుగ బతుకమ్మను సామాజిక చైతన్యం కోసం వినియోగిస్తూ జిల్లా పోలీసు శాఖ వినూత్న కార్యక్రమం చేపట్టింది. ఎస్పీ జానకీ షర్మిల ఆధ్వర్యంలో 'కమ్యూనిటీ బతుకమ్మ' కార్యక్రమం ద్వారా మహిళలతో కలిసి పాటలు పాడుతూ, ఆడుతూ సైబర్ నేరాలు, మోసాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమం గృహిణులను ఒకచోట చేర్చి, సామాజిక సమస్యలపై చైతన్య వేదికగా మారింది.

గృహిణులే సైబర్ బాధితులు..

ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల్లో గృహిణులు ప్రధాన బాధితులుగా మారుతున్నారు. భర్త, పిల్లలు బయట ఉండగా ఇంట్లో ఒంటరిగా ఉండే మహిళలను సైబర్ నేరస్తులు లక్ష్యంగా చేసుకుంటున్నారు. 'మీ భర్తను డిజిటల్ అరెస్ట్ చేశాం, ఓటీపీ ఎంటర్ చేయండి' లేదా 'పట్టుచీర గెలుచుకున్నారు, లింక్ క్లిక్ చేయండి' వంటి ఆకర్షణీయమైన ఎత్తుగడలతో మోసం చేస్తున్నారు.

ఇంటి బాధ్యతలు, సామాజిక జాగ్రత్తలు..

గృహిణులు కేవలం ఇంటి బాధ్యతలతోనే సరిపెట్టుకోకుండా, సామాజిక సమస్యలపై జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. పిల్లలు సెల్‌ఫోన్లలో ఏం చేస్తున్నారు, సోషల్ మీడియాలో ఎవరితో పరిచయాలు పెంచుకుంటున్నారు వంటి అంశాలను పరిశీలించాలి. తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపించడంతో కొందరు యుక్తవయసు పిల్లలు మత్తుపదార్థాలకు బానిసలవుతూ, తప్పుదారి పడుతున్నారు.

మహిళల సమైక్యత..

విద్యార్థులు, యువతను కలవడానికి స్కూళ్లు, కళాశాలలు లేదా సమావేశాలు సరిపోతాయి. కానీ, గృహిణులను ఒకచోట చేర్చడం సవాలుతో కూడుకున్న పని. బతుకమ్మ పండుగ మాత్రం ఈ సవాలును సులభతరం చేస్తుంది. గల్లీలోని మహిళలను ఒకచోటకు చేర్చి, ఆడుతూ పాడుతూ సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తుంది. ఎస్పీ జానకీషర్మిల నాయకత్వంలో పోలీసు శాఖ 'కమ్యూనిటీ బతుకమ్మ' ద్వారా మహిళలకు సైబర్ నేరాలు, మోసాలపై అవగాహన కల్పిస్తోంది. నాయుడివాడ ఆర్యవైశ్య సంఘంలో జరిగిన కార్యక్రమంలో సుమారు 300 మంది మహిళలు పాల్గొనడం ఈ కార్యక్రమ విజయానికి నిదర్శనం.

సైబర్ నేరాల నివారణకు చైతన్యం..

స్మార్ట్‌ఫోన్ యుగంలో రోజుకో కొత్త సైబర్ నేరం పుట్టుకొస్తోంది. ఈ నేరాలు మహిళలను ఎక్కువగా లక్ష్యంగా చేసుకుంటున్నాయి. 'కమ్యూనిటీ బతుకమ్మ' కార్యక్రమంలో పోలీసులు ఓటీపీ షేర్ చేయవద్దని, అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయొద్దని, డిజిటల్ అరెస్ట్ వంటి భయపెట్టే ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దని సూచిస్తున్నారు. అలాగే, యుక్తవయసు పిల్లలను తప్పుదారి నుంచి కాపాడేందుకు తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. మహిళా పోలీసులతో కూడిన 'పోలీస్ అక్క', 'నారీ శక్తి', 'శివంగి టీమ్' వంటి కార్యక్రమాలను కూడా పరిచయం చేస్తూ, సమాజంలో సురక్షిత వాతావరణం కోసం కృషి చేస్తున్నారు.

అవగాహన కల్పించేందుకే..

బతుకమ్మ పండుగవేళ మహిళలతో కలిసి పోలీసుశాఖ కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించాం. ఇందులో భాగంగా 'కమ్యూనిటీ బతుకమ్మ' పేరిట గృహిణులకు పలుఅంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. జిల్లావ్యాప్తంగా కమ్యూనిటీ బతుకమ్మకు మంచిస్పందన వస్తోంది.

– డాక్టర్ జానకీషర్మిల, ఎస్పీ

బాసరలో వైభవంగా శారదీయ శరన్నవరాత్రులు



స్కందమాత అలంకరణలో అమ్మవారు..



పాదయాత్రగా తరలివస్తున్న మహారాష్ట్ర భక్తులు..

బాసర: జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసర శ్రీజ్ఞాన సరస్వతీదేవి క్షేత్రంలో శారదీయ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఐదో రోజు శుక్రవారం అమ్మవారు 'స్కందమాత' అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారు నాలుగు చేతులతో సింహంపై కూర్చుని, చేతిలో కమలం, జలకలశం, ఘంటాతోపాటు, స్కందుడైన కార్తికేయుడిని ఒడిలో కూర్చోబెట్టుకుని, ఒక చేయి అభయముద్రలో భక్తులను అనుగ్రహిస్తుంది. ఆలయ వైదికబృందం అమ్మవారికి చతుషష్టి ఉపచార విశేష పూజలు నిర్వహించి పెరుగన్నం నైవేద్యంగా నివేదించారు. అమ్మవారి దర్శనానికి తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా భక్తులు తరలివచ్చారు. తమ చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు చేయించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఇన్‌చార్జి ఈవో అంజనీదేవి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమం..

వేడుకల్లో భాగంగా శుక్రవారం ఆలయ కోటి గాజుల మండపంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని శాంకరి పాఠశాల విజయవల్లి భరద్వాజ్ వారిచే కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. భవానీ మాత అలంకరణలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఇవి భక్తులను అలరించాయి.


పాదయాత్రగా వచ్చిన భక్తులు....

బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారిని దర్శించుకునేందుకు కిరణ్ గురూజీ బడుల్కర్ ఆధ్వర్యంలో భక్తులు మహారాష్ట్ర నాందేడ్ జిల్లా నుంచి బాసర వరకు పాదయాత్రగా వచ్చారు. అమ్మవారిని దర్శించుకున్నారు.

గోదావరిలో పుణ్య స్నానాలు..

వేడుకల కోసం బాసరకు వస్తున్న భక్తులు పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. శివాలయంలో పూజలు చేసి సరస్వతీ అమ్మవారికి మొక్కలను చెల్లించుకుంటున్నారు.

పత్తి కొనుగోళ్లు ప్రారంభం



కొనుగోళ్ల ప్రారంభంలో అధికారులు, వ్యాపారులు

కుభీర్: మండల కేంద్రమైన కుభీర్‌లోని నగేశ్ ఇండస్ట్రీస్‌లో శుక్రవారం(ప్రైవేటు)పత్తికొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. క్వింటాల్‌కు రూ.7,251 ధర చెల్లించారు. మార్కెట్ చైర్మన్ కళ్యాణ్, కార్యదర్శి రాజేశ్వర్ నాయికులు విఠల్, రాములు, పెంటాజీ, విజయ్, కనకయ్య, లక్ష్మణ్, బషీర్, బాబు, రవికుమార్, బక్కన్న, వ్యాపారులు సంతోష్, ఆనంద్, నాగేశ్వర్, బాలాజీ, రమేశ్, సాయినాథ్ పాల్గొన్నారు.

పుట్టింటికి ఆడబిడ్డలు!

- బతుకమ్మ వేడుకలకు సొంతూళ్లకు యువతులు, మహిళలు
- పండుగ కోసం కార్యక్రమాలన్నీ వాయిదా
- తొమ్మిది రోజులు కుటుంబ సభ్యులు, స్నేహితులతో సంబరాలు


నిర్మల్ జిల్లా కేంద్రంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వయ్యారి భామ పూలోయ్..
నీముక్కు ముక్కెరలూ..
అడవి మోదుగుపూలోయ్..
నీనుదుట కుంకుమలు..
ఎంతటి అందాల మహరాణివే..
నీచుట్టూ పూలన్నీ చెలికత్తెలే..
నిన్ను చూడాలని ముందుగ
వచ్చిందే పువ్వుల దీపావళి..
బతుకమ్మ రాకతో మా వాకిలి
మురిసెలే..

అంటూ ఓ కవి బతుకమ్మను వర్ణిస్తూ రాశారు. బతుకమ్మ పండుగకు ఎంత ప్రాధాన్యం ఉంటుందో ఆడబిడ్డలకు అంతే ప్రాధాన్యం ఉంటుంది. యువతులు, మహిళలకు బతుకమ్మ పండుగ ఎంతో ప్రత్యేకమైనది. వృత్తి, ఉద్యోగాల రీత్యా దూర ప్రాంతాల్లో ఉంటున్నవారు పండుగ కోసం సొంతూళ్లకు వస్తారు. విదేశాలకు వెళ్లినవారు, వివాహం జరిగి మెట్టినింటికి వెళ్లిన మహిళలూ పుట్టింటికి చేరుకుంటారు. ఎక్కడ ఉన్నా, ఎన్ని పనులు ఉన్నా బతుకమ్మ, దసరా పండుగను మరువకుండా సొంతూరికి చేరుకుని తొమ్మిది రోజుల పాటు బంధువులు, స్నేహితుల మధ్య సంతోషంగా గడపడం, సంబరాలు చేసుకోవడం పండుగ ప్రత్యేకతను చాటుతోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆడబిడ్డలు పుట్టింటికి చేరుకున్నారు. సొంతూళ్లకు వచ్చిన మహిళలు, యువతుల అభిప్రాయాలు వారి మాటల్లో..

పనులు మానుకొని..



ఆసిఫాబాద్అర్బన్: ఏటా బతుకమ్మ పండుగకు ఎన్ని పనులు ఉన్నా మానుకొని తప్పనిసరిగా హైదరాబాద్ నుంచి ఆసిఫాబాద్ సొంతింటికి వస్తాను. కాలనీవాసులతో కలిసి బతుకమ్మ ఆడుతాను. సద్దుల పండుగకు సుమారు రూ.5వేల ఖర్చుతో పూలను విక్రయించి బతుకమ్మ పేరుస్తాను.

– స్రవంతి

ప్రతీ ఏడాది వస్తా..



మంచిర్యాలటౌన్: బతుకమ్మ పండుగ అంటే మాకు ఎంతో ప్రత్యేకం. అందుకే ఏటా పండుగ కోసం హైదరాబాద్ నుంచి మంచిర్యాలకు వస్తాను. లక్ష్మీనగర్‌లో అందరితో కలిసి బతుకమ్మ ఆడుతూ, పాటలు పాడుతూ ఆనందంగా గడుపుతాం.

– సుమ

ముంబై నుంచి..



ఖానాపూర్: నా భర్త ముంబైలో ఏసీ మెకానిక్ పని చేస్తాడు. మేం అక్కడే ఉంటాం. ప్రతీ సంవత్సరం దసరా, బతుకమ్మ ఉత్సవాలకు పిల్లలతో కలిసి ఖానాపూర్‌కు వస్తాం. ఈ ఏడాది భవాని దీక్ష తీసుకున్నాను. పండుగలు ముగిసే వరకు ఇక్కడే ఉంటాం.

– మత్రి లక్ష్మి

పండుగ కోసమే..



మంచిర్యాలటౌన్: చిన్ననాటి నుంచి బతుకమ్మ పండుగ వస్తే చాలు స్నేహితులతో కలిసి పూలను సేకరించి, బతుకమ్మ పేర్చేవాళ్లం. పెళ్లయిన తరువాత కూడా బతుకమ్మ పండుగ జరుపుకోవడానికి భర్తతో కలిసి హైదరాబాద్ నుంచి మంచిర్యాలకు వస్తున్నాను. మంచిర్యాలలో బతుకమ్మ పండుగను ఎప్పటికీ మిస్ కానివ్వను.

– హర్షిణి

కెనడా నుంచి వచ్చాం..



మంచిర్యాలటౌన్: పెళ్లయిన తరువాత కెనడాలోనే ఉంటున్నాం. రెండున్నర సంవత్సరాల తర్వాత బాబుతో కలిసి పండుగ కోసం మంచిర్యాలకు వచ్చాను. అమ్మ వాళ్లది గద్దెరాగడి ప్రాంతం. అత్త వారిది మంచిర్యాల. ఇక్కడే పండుగ జరుపుకోవాలని కెనడా నుంచి వచ్చాం.

– సౌమ్య

తల్లిగారింటికే..



ఖానాపూర్: మాది ఖానాపూర్ మండలం సుర్జాపూర్ గ్రామం. దసరా సందర్భంగా పిల్లలకు సెలవులు రాగానే పిల్లలతో కలిసి తల్లిగారింటికి వస్తాను. పూల పండుగ, దుర్గా నవరాత్రులు, దసరా ఇక్కడే చేసుకుంటాను.

– గంగమణి

18 ఏళ్లుగా సొంతూరిలోనే..



ఆసిఫాబాద్అర్బన్: నాకు వివాహం జరిగి 18 ఏళ్లు గడిచింది. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో ఉంటున్నాం. ఇప్పటికీ బతుకమ్మ పండుగకు ఆసిఫాబాద్‌కు పుట్టింటికి వస్తాను. మా కాలనీలోని స్నేహితులతో కలిసి బతుకమ్మ వేడుకలు జరుపుకుంటాం. అందరం ఏకరూప చీరలు ధరించి వేడుకల్లో పాల్గొంటాం.

– కొత్త హాసిని

వారం రోజులు సెలవు పెట్టి..



చెన్నూర్: మా అత్తగారిది నిజామాబాద్. నా భర్త, నేను హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాం. ప్రతీ ఏడాది బతుకమ్మ పండుగకు చెన్నూర్‌కు వస్తా. పల్లెల్లో బతుకమ్మ పండుగ మజానే వేరుగా ఉంటుంది. వారం రోజులు సెలవు తీసుకొని పండుగ కోసం వచ్చా.

– నీల నవ్యరాణి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

సెలవులు వచ్చాయంటే..



కాగజ్‌నగర్‌టౌన్: నాలుగేళ్లుగా హైదరాబాద్‌లోనే ఉండి చదువుకుంటున్నాను. దసరా సెలవులు వచ్చాయంటే హైదరాబాద్ నుంచి సొంతూరు కాగజ్‌నగర్‌కు వస్తా. పండుగకు ఇతర పట్టణాల్లో ఉన్న నా స్నేహితులు అందరూ కాగజ్‌నగర్‌కు వస్తారు. అందరం సద్దుల బతుకమ్మ రోజు ఎస్పీఎం క్రీడా మైదానంలో కలుస్తాం.

– అరుంధతి

పుట్టింట్లోనే పండుగ



కాగజ్‌నగర్‌టౌన్: బతుకమ్మ పండుగను ప్రతీ సంవత్సరం పుట్టింట్లోనే కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకుంటాం. ఉద్యోగరీత్య కరీంనగర్‌లో స్థిరపడ్డాను. కాగజ్‌నగర్‌కు వచ్చి బంధువులు, చిన్ననాటి స్నేహితులతో కలిసి బతుకమ్మలను పేర్చి ఆనందోత్సవాల మధ్య పండుగ జరుపుకుంటాను.

– రత్నప్రభ, టీచర్

వేరే చోట ఉండలేక..



ఖానాపూర్: మేం జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో స్థిరపడ్డాం. నా భర్త ప్రైవేటు ఉద్యోగం చేస్తాడు. నేను ఇంట్లోనే టైలరింగ్ చేస్తాను. ప్రతీ సంవత్సరం బతుకమ్మ పండుగకు ఖానాపూర్‌లోని ఇంద్రనగర్‌కు చేరుకుంటాం. పండుగల సమయంలో వేరే చోట ఉండడం కష్టంగా ఉంటుంది. స్వగ్రామంలో కుటుంబ సభ్యులు, బంధువుల మధ్య పండుగ జరుపుకోవడం సంతోషంగా ఉంటుంది.

– బీమర్తి సుమలత

రెండు రోజుల ముందే..



ఆసిఫాబాద్అర్బన్: బతుకమ్మ పండుగ వస్తుందంటే ఎన్ని పనులు ఉన్నా సొంతూరు ఆసిఫాబాద్‌కు రెండు రోజుల ముందుగానే చేరుకుంటాను. ప్రస్తుతం నేను మంచిర్యాల జిల్లా జైపూర్‌లో ఉంటున్నాను. పెళ్లి జరిగి 12 సంవత్సరాలైనా బతుకమ్మ పండుగకు అమ్మగారి ఇంటికి వచ్చి అక్కాచెల్లెళ్లు, స్నేహితులతో సంతోషంగా పండుగ జరుపుకుంటాను.

– పెంద్యాల సౌమ్య

సొంతూళ్లో జరుపుకోవడం ఇష్టం



చెన్నూర్: సొంతూళ్లో బతుకమ్మ పండుగ జరుపుకోవడం చాలా ఇష్టం. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా. ఎంత బిజీగా ఉన్నా పండుగ కోసం పిల్లలతో చెన్నూర్‌కు వచ్చా. ఇక్కడ అన్ని రకాల సహజ సిద్ధమైన పూలు అందుబాటులో ఉంటాయి. అందరితో కలిసి బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకుంటాం.

– బచ్చు దివ్య, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

సొంతూరే గుర్తుకొస్తుంది..



ఆసిఫాబాద్అర్బన్: బతుకమ్మ పండుగ అంటేనే నాకు గుర్తుకొచ్చేది సొంతూరు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న నేను పండుగ వస్తుందంటే ఆసిఫాబాద్‌కు చేరుకుంటాను. చిన్ననాటి స్నేహితులు, బంధువులతో కలిసి సరదాగా గడుపుతాను. పండుగలు కేవలం ఆనందం కోసం మాత్రమే కాదు. మన మూలాలను గుర్తు చేసుకొనే వేడుక.

– కొండ సంగీత, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

క్లుప్తంగా

అడవి పందుల బీభత్సం

కెరమెరి: మండలంలోని కెలిబి గ్రామ శివారులో అడవి పందులు బీభత్సం సృష్టించాయి. ఒక్క రాత్రిలోనే నలుగురు రైతులకు చెందిన ఏడు ఎకరాల పత్తి పంటను ధ్వంసం చేశాయి. గురువారం రాత్రి గిత్తె లక్ష్మణ్, గిత్తే చంద్రకాంత్, మహండోరే పాండు, ఏక్‌నాథ్‌లకు చెందిన సుమారు ఏడు ఎకరాల్లో పత్తి పంటను నాశనం చేశాయి. కాత, పూత దశలో ఉన్న పత్తి పంట నేలవాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి నష్టపరిహారం అందజేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

బట్టల దుకాణాల్లో చోరీ

భైంసాటౌన్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలోగల పలు వస్త్ర దుకాణాల్లో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు సీఐ గోపినాథ్ తెలిపారు. గుజిరిగల్లికి చెందిన సయ్యద్ యాకూబ్‌కు చెందిన రెడీమెడ్ వస్త్ర దుకాణం షట్టరు పగులగొట్టిన దొంగలు రూ.15వేల విలువైన దుస్తులు చోరీ చేసినట్లు పేర్కొన్నారు. మరో నాలుగు దుకాణాల్లోనూ చోరీకి యత్నించినట్లు సీఐ తెలిపారు. బాధితుడు యాకూబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం


పూర్తిగా కాలిపోయిన ఇంటిలోని సామగ్రి

ముధోల్: సిలిండర్ పేలి రేకుల ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలోని గన్నోరా గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గన్నోరా గ్రామంలో దరికే పీరాజీకి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా తన రేకుల షెడ్డు పక్కనే నిర్మాణం చేపట్టారు. శుక్రవారం కొత్తింటికి గడపలు పెట్టుకొని బంధువులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈక్రమంలో ఒక్కసారిగా సిలిండర్ నుంచి మంటలు రాగా పీరాజీ భార్య రేణుక రేకుల షెడ్డు నుంచి బయటకు పరుగులు తీసింది. కుటుంబ సభ్యులు, చుట్టు పక్కల వారు ఇంట్లోకి వెళ్లి గమనించే లోగా సిలిండర్ ఒక్కసారిగా పేలింది. దీంతో భయపడి అందరూ బయటకు పరుగులు తీశారు. మంటలు వ్యాపించి ఇంటి నిర్మాణం కోసం అప్పుగా తీసుకొచ్చిన రూ. 3లక్షలతో పాటు ఇంటి సామగ్రి పూర్తిగా దగ్ధమైందని బాధితుడు వాపోయాడు.

అమ్మవారికి రూ.11 లక్షల కరెన్సీ హారం


ధర్మోరలో రూ.11 లక్షల నోట్ల హారంతో దర్శనమిస్తున్న దుర్గామాత

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర, పంచగుడి గ్రామాల్లో దుర్గాదేవి శుక్రవారం సరస్వతి దేవి (మూల నక్షత్రం) అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మోర గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ మామిడి నారాయణరెడ్డి తన సొంత డబ్బులు రూ.11 లక్షలు, పంచగుడిలో గ్రామస్తులు రూ.5లక్షల విలువైన నోట్లను హారాలుగా మార్చి అమ్మవారి మెడలో అలంకరించారు.

రూ.8.50 లక్షల కరెన్సీ హారం..

ఖానాపూర్: పట్టణంలోని గాంధీనగర్‌తోపాటు తర్లపాడ్ గ్రామంలోని దుర్గామాత మండపంలో దుర్గాదేవిని శుక్రవారం కరెన్సీతో అలంకరించారు. తర్లపాడ్‌లో పెద్ద ఎత్తున రూ.8.50 లక్షల కరెన్సీ హారంతో దుర్గామాతను అలంకరించారు.


నిర్మల్‌లో రూ.12 లక్షల నగదుతో..

నిర్మల్‌టౌన్: నిర్మల్ ధ్యాగవాడ హనుమాన్ ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాతను శుక్రవారం ధనలక్ష్మిగా అలంకరించారు. రూ.100, రూ.200, రూ.500 నోట్లతో మొత్తం రూ.12,58,571 కరెన్సీతో అలంకరించారు.

గ్రూప్–1లో మెరిసిన ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

బాసర: ఇటీవల విడుదలైన గ్రూప్ 1 ఫలితాల్లో బాసర ఆర్జీయూకేటీ పూర్వ విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. యూనివర్సిటీకి చెందిన 8 మంది డీఎస్పీలుగా ఎంపికయ్యారు. బీ08 బ్యాచ్‌కు చెందిన స్వామి (సిద్దిపేట), అమరేందర్ (ఆదిలాబాద్), బీ09 బ్యాచ్‌కు చెందిన ఆదికేశవరెడ్డి (హైదరాబాద్), సాయి చరణ్(నల్లగొండ), బీ11 బ్యాచ్‌కు చెందిన నిఖిల (నిజామాబాదు), సి.భవాని (నల్లగొండ), బీ12 బ్యాచ్ విద్యార్థి శ్రీకాంత్ (సిద్దిపేట), బీ14 విద్యార్థిని కవిత (వనపర్తి)లు ఎంపికయ్యారు. వీరితో పాటు బీ08 బ్యాచ్ విద్యార్థి శ్రీరాం కుమార్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా, బీ09 విద్యార్థి వి. రాజశేఖర్ రెడ్డి(సూర్యాపేట) కమర్షియల్ ట్యాక్సు ఆఫీసర్‌గా, బీ11 సురేశ్(కరీంనగర్) ఎంపీడీవోగా, వెంకటేశ్ ఆడిట్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. విద్యార్థుల విజయానికి వీసీ గోవర్ధన్, ఓఎస్డీ మురళీ దర్శన్, అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

దేగామలో మద్యపాన నిషేధం


మద్యం సీసాలు ధ్వంసం చేస్తున్న గ్రామస్తులు

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ గ్రామంలో గ్రామస్తులు మద్యపాన నిషేధంపై తీర్మానంతో పాటు ప్రతిజ్ఞ చేశారు. శుక్రవారం గ్రామంలో బెల్టు షాపులను తొలగించి, మందు సీసాలను ధ్వంసం చేశారు. గ్రామంలో బెల్ట్‌షాపులను తొలగించాలని ఇటీవల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌కు, ఇచ్చోడలో ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నానం రమణ, మేకల వెంకన్న, పోరెడ్డి శ్రీనివాస్, బొడ్డు భోజరెడ్డి, మగ్గె అశోక్, అరుణ్, శ్రీనివాస్, మగ్గె రమణ, శేఖర్, లక్ష్మణ్, శ్రీకాంత్, నానం గాంధీ, ఆదిత్య పాల్గొన్నారు.

సదర్మాట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే


ఖానాపూర్: మండలంలోని మేడంపల్లి గ్రామంలోని సదర్మాట్‌ను శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సందర్శించారు. ఎస్సారెస్పీ గేట్లు ఎత్తి దిగువకు వదిలిన వరద కారణంగా రెండు రోజుల క్రితం సదర్మాట్ వద్ద ఒక గేటు కొట్టుకుపోవడంతో పాటు మరో గేటు వంగిపోయింది. దీంతో వరద నీరు కాలువలోకి వెళ్తోంది. విషయం తెలియడంతో అక్కడికి వెళ్లిన ఎమ్మెల్యే సంబంధిత డీఈ వీరన్నతో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే గేట్లు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట నాయకులు దయానంద్, నిమ్మల రమేశ్, రాజునాయక్, జంగిలి శంకర్, గాజుల శ్రీనివాస్, కడార్ల గంగనర్సయ్య, సాగర్, హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

‘బీఎంఎస్ కృషితోనే మెరుగైన బోనస్’


మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

నస్పూర్: బీఎంఎస్ కృషి ఫలితంగానే కార్మికులకు మెరుగైన బోనస్ వస్తోందని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘం (బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే 5 గనిపై శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 25న కోల్‌కతాలో కోల్ ఇండియా యాజమాన్యంతో జరిగిన సమావేశంలో బీఎంఎస్ వేజ్‌బోర్డు సభ్యులు సుధీర్‌గురుడే, సుర్జీత్ సింగ్, పవన్‌కుమార్‌లు పాల్గొని ప్రాఫిట్ లింక్డ్ రివార్డు(పీఎల్‌ఆర్)దీపావళి బోనస్‌ను రూ.103000 చెల్లించేందుకు కృషి చేశారని పేర్కొన్నారు. ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు సారంగపాణి, రాగం రాజేందర్, ప్రభాకర్, రమేశ్, మేకల స్వామి, రాజారాం, కిరణ్, రామకృష్ణ, తిరుపతి, అరుణ్‌కుమార్, ప్రశాంత్, మిట్టపల్లి మొగిలి తదితరులు పాల్గొన్నారు.

‘గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి’


అవగాహన కల్పిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఇంద్రవెల్లి: గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. గర్భిణుల ఆరోగ్య వివరాలు, అందుతున్న వైద్య సేవలు, తీసుకుంటున్న పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గోండి, కొలాం భాషలో ముద్రించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు ప్రతీ నెల పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యాధికారి కుద్మేత మనోహర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, వైద్యులు వసంతరావ్, పూజిత, హెచ్‌ఈవో నాందేవ్, హెల్త్ సూపర్‌వైజర్ పవార్ సురేశ్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

బావి నీటితో అనారోగ్యం!

- వాంతులు, విరేచనాలతో ఆసుపత్రిలో చేరిక


బావి నీటిని పరిశీలిస్తున్న అధికారులు

నార్నూర్: మండల కేంద్రంలోని జీన్‌గూడ(ఆదర్శనగర్), ఈద్గానగర్ కాలనీవాసులు కొందరు వాంతులు, విరేచనాలతో అనారోగ్యం బారిన పడిన ఘటన శుక్రవారం వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని జీన్‌గూడ (ఆదర్శనగర్), ఈద్గానగర్ కాలనీవాసులు గత 15 ఏళ్లుగా జీన్‌గూడ గ్రామ సమీపంలో ఉన్న బావి నీటిని తాగుతున్నారు. ఈక్రమంలో గత మూడు రోజులుగా వారు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. శుక్రవారం వాంతులు, విరేచనాలు ఎక్కువ కావడంతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. జీన్‌గూడకు చెందిన బాబాఖాన్ అనే వ్యక్తి ఫోన్ ద్వారా జిల్లా కలెక్టర్ రాజర్షిషా దృష్టికి సమస్య తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కలెక్టర్ ఎంపీవో సాయిప్రసాద్‌కు ఫోన్ చేసి సమస్యపై ఆరా తీశారు. అనారోగ్యానికి గల కారణాలు, బావి నీటిని క్లోరినేషన్ చేశారా? లేదా? వంటి అంశాలపై నివేదిక అందజేయాలని ఆదేశించారు. డీఎల్‌పీవో ప్రభాకర్, ఎంపీడీవో గంగాసింగ్, ఎంపీవోలు జీన్‌గూడ, ఈద్గానగర్ కాలనీలతో పాటు బావిని సందర్శించారు. బావి నీటిని పరీక్షల నిమిత్తం ఉట్నూర్‌కు పంపించారు. రిపోర్టు ఆధారంగా బావి నీటితో సమస్య లేనట్లుగా తెలుస్తోంది. మరిన్ని రిపోర్టులు శనివారం రానున్నాయి. ప్రస్తుతం వాంతులు, విరేచనాలు అదుపులోనే ఉన్నాయని అధికారులు తెలిపారు.

అనాథ పిల్లలతో కలెక్టర్ సమావేశం


అనాథ పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: పీఎం కేర్ ఫర్ చిల్డ్రన్స్‌లో భాగంగా అనాథ పిల్లలతో ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పిల్లల ఆరోగ్యం, వసతి, చదువు, సంరక్షణతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సంరక్షకులతోనూ మాట్లాడారు. సమస్యలను నమోదు చేసుకుని పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. 202 మంది పిల్లలకు ఆరోగ్యశ్రీ, అలాగే 8 మందికి ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. అనంతరం వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ప్రతీ మూడు నెలలకోసారి పిల్లలతో సమావేశమవుతామని తెలిపారు. కాగా ఆర్‌బీఎస్‌కే ద్వారా పిల్లలకు రక్తపరీక్షలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ సలోని, డీడబ్ల్యూవో మిల్కా, ఆరోగ్యశ్రీ డిస్ట్రిక్ట్ మేనేజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గడువు ముగిసిన కూల్‌డ్రింక్స్ విక్రయాలు


కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్‌ను పరిశీలిస్తున్న బల్దియా అధికారులు

కైలాస్‌నగర్: కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్‌ను విక్రయిస్తున్న ఘటన శుక్రవారం బల్దియా అధికారుల ఆకస్మిక తనిఖీల్లో వెలుగు చూసింది. ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్‌లో గల సాయి నాగరాజు ట్రేడర్స్‌లో బల్దియా శానిటరీ ఇన్‌స్పెక్టర్ బైరీ శంకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గడువు మీరిన నాలుగు రకాల కూల్‌డ్రింక్స్‌ను వ్యాపారులకు సరఫరా చేస్తున్నట్లుగా గుర్తించారు. దీనిపై ట్రేడర్స్ యజమాని నగేశ్‌ను ప్రశ్నించగా వాటిని తిరిగి కంపెనీకి వెనక్కి పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. సదరు వ్యాపారి సమాధానంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ రూ.5వేల జరిమానా విధించారు. ఇలాంటి పరిస్థితి మళ్లీ పునరావృతం కావొద్దని హెచ్చరించారు. బల్దియా పర్యావరణ ఇంజనీర్ అవి కిరణ్, శేఖర్ ఉన్నారు.

గంజాయి పట్టివేత

మందమర్రిరూరల్: జాతీయ రహదారి టోల్‌ప్లాజా సమీపంలో ముగ్గురు వ్యక్తుల నుంచి 750 గ్రాముల గంజాయి పట్టుకున్నట్లు సీఐ శశిధర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సర్కిల్ ఆఫీస్‌లో వివరాలు వెల్లడించారు. ఆసిఫాబాద్ జిల్లా ఈజ్‌గావ్‌కు చెందిన తరుణ్‌సర్కార్, మంచిర్యాల పట్టణం తిలక్ నగర్‌కు చెందిన షక్‌జీజ్, వనం సాయికృష్ణలకు గంజాయి విక్రయిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.